క్లుప్తంగా

బాలాజీ ఆలయంలో పూజలు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం శుక్రవారం కావడంతో మహిళలు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనగా సామూహిక కుంకుమార్చన, గోపూజ, స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. అలాగే, ఆలయ మేనేజర్ రమణ గోపూజ చేశారు. ఆలయ సిబ్బంది రామారావు, అబ్బాస్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణుడి ఊరేగింపు

అశ్వారావుపేటరూరల్: శ్రీ కృష్ణాష్టమి పండుగ సందర్భంగా శుక్రవారం అశ్వారావుపేటలో స్వామి వారి విగ్రహంతో పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. స్థానిక మార్వాడీలు పాల్గొనగా, పురవీధుల్లో ఊరేగింపుగా వెళ్తూ పాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురంలో 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. వినాయకపురం ఫీడర్ మరమ్మతుల కారణంగా ఉదయం 8నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు వినాయకపురంతోపాటు, నారాయణపురం, గంగారం సబ్‌స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని వెల్లడించారు.

భద్రాచలం పట్టణంలో..

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో శనివారం నుంచి వారం పాటు నిత్యం ఉదయం 9నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ వేణు తెలిపారు. పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో లోఓల్టేజీ సమస్యను పరిష్కరించేందుకు గాను మరమ్మతులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఇందులోభాగంగా శనివారం పాత మార్కెట్ ఏరియా, గొల్లబజార్, సాయిబాబా టెంపుల్ ఏరియా, పాత ఎల్‌బీసీ ఏరియా, అంబసత్రం ఏరియా, ఎల్ఎఫ్ పాఠశాల, ముదిరాజ్ బజార్ కాలనీల్లో విద్యుత్ అంతరాయం కలుగుతుందని తెలిపారు.

నేడు మంత్రి, విప్ పర్యటన

బూర్గంపాడు/మణుగూరు: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు శనివారం బూర్గంపాడు, మణుగూరు మండలాల్లో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 12.40 గంటలకు బూర్గంపాడులోని కస్తూర్బా పాఠశాలలో నిర్మించిన భవనాలను మంత్రి, విప్ ప్రారంభిస్తారు. అనంతరం బూర్గంపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో నూతన భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం మణుగూరు మండలంలో రూ.25కోట్ల వ్యయంతో అటవీశాఖ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన రథంగుట్ట అర్బన్ పార్క్‌ను ప్రారంభించడంతో పాటు మణుగూరు మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులను, నూతన బస్టాండ్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. ఆతర్వాత మణుగూరులోని కిన్నెర కళ్యాణ మండపంలో జరిగే బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మంత్రి, విప్ పాల్గొంటారు.

నేడు బీజేపీ రాష్ట్ర నాయకుల రాక



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్

దమ్మపేట: మండల కేంద్రంలో శనివారం జరిగే బీజేపీ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమ్మేళనానికి రాష్ట్ర నేతలు ఈటెల రాజేందర్, గరికపాటి మోహన్‌రావు హాజరుకానున్నారని బీజేపీ మండల నాయకులు తెలిపారు. పార్టీ నాయకుడు భూక్యా ప్రసాద్ శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ శనివారం ఉదయం 10 గంటలకు మొదలయ్యే సమ్మేళనానికి రాష్ట్ర నాయకులు హాజరుకానున్న నేపథ్యాన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈసమావేశంలో నాయకులు ఉతడనేని విశ్వేశ్వరరావు, దారా నాగేశ్వరరావు, బాలాజీ, రవి తదితరులు పాల్గొన్నారు.

10న అంబేడ్కర్ జీవిత చరిత్ర ప్రదర్శన

అశ్వారావుపేటరూరల్: రాజ్యాంగ నిర్మాత, అంబేడ్కర్ జీవిత చరిత్రతో రూపొందించిన నాటకాన్ని ఈనెల 10వ తేదీన అశ్వారావుపేటలో ప్రదర్శిస్తున్నట్లు పాల్వంచ సహాయ సాంఘిక సంక్షేమ అధికారి శివభాస్కర్ తెలిపారు. స్థానిక గిరిజన భవన్‌లో సాయంత్రం 6గంటలకు మొదలయ్యే ప్రదర్శనకు ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకులు, అధికారులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అద్దె భవనాల్లోనే అంగన్‌వాడీలు



మానుగట్టలోని పూరి గుడిసెలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

- ఇరుకు గదులు, అసౌకర్యాల నడుమ నిర్వహణ
- అరకొర వసతులతో లబ్ధిదారుల ఇక్కట్లు
- అయినా పట్టింపు లేనట్లుగా అధికారులు



నిర్మాణం మధ్యలో నిలిచిపోయిన కేశవపట్నం సెంటర్

దుమ్ముగూడెం: మండలంలోని ఎక్కువ అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో అరకొర వసతుల మధ్య కొనసాగుతున్నాయి. జిల్లాలో అతి పెద్దదైన దుమ్ముగూడెం అంగన్‌వాడీ ప్రాజెక్టు కింద మండలంలో 135 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 89 కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయి. అయితే, అద్దె భవనాల్లో సరైన సదుపాయాలు లేక చిన్నారులు, గర్భిణులు అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రభుత్వం స్త్రీ, శిశుసంక్షేమ శాఖ ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు పౌష్టికాహారం అందించడం వంటి సౌకర్యాలు సమకూరుస్తుండగా.. అద్దె భవనాల కారణంగా చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలకు పంపించేందుకు ఆసక్తి కనబర్చడం లేదు.

మండలంలో 135 సెంటర్లు

మండలవ్యాప్తంగా 135 అంగన్‌వాడీ సెంటర్లు ఉంటే 89 కేంద్రాలకు మాత్రమే పక్కాభవనాలు ఉన్నాయి. ఇక 16 అంగన్‌వాడీ కేంద్రాలు ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ భవనాల్లో నిర్వహిస్తుండగా.. మిగతా 30 కేంద్రాలు అద్దెభవనాల్లో అసౌకర్యాల నడుమ కొనసాగుతున్నాయి. మండలంలో అంగన్‌వాడీ సెంటర్లకు మూడేళ్ల లోపు చిన్నారులు 1,734 మంది, మూడు నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులు 1,185 మందితో పాటు గర్భిణులు 445, బాలింతలు 300మంది లబ్ధిదారులు ఉన్నారు. కాగా, గ్రామీణ ప్రాంతాల్లో అద్దె భవనాల్లో నిర్వహించే కేంద్రాలకు చుట్టూ పక్కల ఖాళీస్థలం లేకపోవడం, గదులు ఇరుకుగా ఉండటంతో పిల్లలు ఎక్కువ సేపు గడపలేని పరిస్థితి కనిపిస్తోంది. ఇంకొన్ని భవనాల్లోనైతే తాగునీటి వసతి కూడా లేక టీచర్లు ఇబ్బంది పడుతూ నిర్వహణ చేపడుతున్నారు.

అసంపూర్తిగా వదిలేశారు..

మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాల నిర్మాణాల కోసం రెండేళ్ల క్రితం నిధులు మంజూరయ్యాయి. అయితే, పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు అసంపూర్తిగా వదిలేశారు. ఉపాధి హామీ పథకం కింద నిర్మాణం చేపట్టిన భవనాల్లో ఎనిమిదింటిని మధ్యలో ఆపేశారు. మధ్యలో ఆగిపోయిన భవనాల్లో ఉపాధి హామీ నిధులతో చేపట్టిన కేశవపట్నం, పాత జిన్నెలగూడెం, కొత్త జిన్నెలగూడెం, పాయం వారి గుంపు, కొమ్మనాపల్లి, సింగవరం కాలనీ, ఎస్.లక్ష్మీపురం, బొజ్జికుప్ప సెంటర్లు ఉండగా, సీఎస్ఆర్ నిధులతో చేపట్టిన సింగవరం సెంటర్ ఉంది. వీటిలో మూడు భవనాలు స్లాబ్ వరకు పనులు జరగగా, మిగతావి రూఫ్ స్థాయిలో నిలిచిపోయాయి.

అద్దె భవనాల్లో మినీ కేంద్రాలు...

మండలంలో ఉన్న దాదాపు 30 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. పర్ణశాల సెక్టార్‌లోని పర్ణశాల, పిరాయిగూడెం, చిన్నబండిరేవు, ఎస్ కొత్తగూడెం, సంగెం, చిన్న సంగెం గుంపు, దుమ్ముగూడెం సెక్టార్‌లోని బుర్రవేముల, రామచంద్రపురం, ములకపాడు క్రాస్ రోడ్డు, ఆంధ్రకేసరి నగర్, కేశవపట్నం, సున్నంబట్టి, కొత్త జిన్నెలగూడెం గుంపు, మానుగట్ట సెంటర్లు ఈ జాబితాలో ఉన్నాయి. ఇక దుమ్ముగూడెం-1, వర్క్‌షాపు, నర్సాపురం సెక్టార్‌లోని వెంకట్రాంపురం, కే రేగుబల్లి, మారాయిగూడెం సెక్టార్‌లోని బొజ్జికుప్ప, పాయంవారి గుంపు, గద్దమడుగు, ఎస్.లక్ష్మీపురం, సింగవరం కాలనీ, సింగవరం, ఆర్లగూడెం సెక్టార్‌లోని పెద్దకమలాపురం, గొందిగుంపు, ఉబ్బావారి గుంపు, మహదేవపురం, కొడివారిగుంపు, బట్టిగూడెం గ్రామాల్లో అద్దె భవనాల్లోనే కేంద్రాలు నిర్వహిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు ఇకనైనా స్పందించి అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే, అసంపూర్తిగా మిగిలిపోయిన భవన నిర్మాణాలను పూర్తిచేయడంపై దృష్టి సారించాలని విన్నవిస్తున్నారు.

నివేదికలు పంపించాం..



మండలంలో అంగన్‌వాడీ కేంద్రాల పరిస్థితిపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించాం. అద్దె భవనాల్లో కొనసాగుతున్న సెంటర్లతో పాటు మధ్యలో నిలిచిపోయిన నిర్మాణ వివరాలను నివేదికలో పొందుపర్చాం. – నవ్యశ్రీ, ఐసీడీఎస్ సీడీపీఓ

భద్రాచలం కోర్టులో ముందస్తు లోక్ అదాలత్



లోక్ అదాలత్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న జడ్జి

భద్రాచలంఅర్బన్: జాతీయ లోక్ అదాలత్ శనివారం జరగనున్న నేపథ్యాన భద్రాచలం జ్యూడిషియల్ కోర్టులో శుక్రవారం స్పెషల్ బెంచ్ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా 14 రాజీ కేసులు, 42 జరిమానా కేసులు, 743 సమ్మర్ ట్రయల్ కేసులతో పాటు ఒక మెయింటనెన్స్ కేసును పరిష్కరించారు. ఈ సందర్భంగా జరిమానా కూడా రూ.3,72,800 వసూలు చేశారు. అనంతరం జడ్జి ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాజీ పడదగిన అన్ని కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరిస్తామని తెలిపాటి. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భద్రాచలం బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన కక్షిదారులకు తాగునీరు, పులిహోర పంపిణీ చేయగా, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవదానం, ఏపీపీ సాంబ దుర్గాబాయ్, లోక్ అదాలత్ మెంబర్ ఎస్.మల్లేష్, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ లాయర్ బి.శారద, టౌన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం



ఎమ్మెల్యే మెచ్చా చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

దమ్మపేట: రహదారి సమస్యను పరిష్కరించేలా బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.80లక్షలు మంజూరు చేయడంపై మండల కేంద్రంలోని మల్లారం, కార్పెంటర్ కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు చిత్రపటాలకు పాలాభిషేకం, పుష్పాభిషేకం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ దారా యుగంధర్, పండూరి వీరబాబు, అత్యం శేఖర్, కిన్నెర నాగరాజు, వరలక్ష్మి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లిలో...

ములకలపల్లి: మండలంలోని పలు గ్రామాలకు బీటీ రహదారుల కోసం నిధులు మంజూరు చేయించడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కొత్త జిన్నెలగూడెం నుండి రాచన్నపేటకు బీటి రోడ్డుకు రూ.1.12కోట్లు, ముత్యాలంపాడు శివారులో హైలెవల్ బ్రిడ్జికి రూ.5.25 కోట్లు మంజూరైన నేపథ్యాన ముత్యాలంపాడు, తదితర గ్రామాల ప్రజలు శుక్రవారం ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సర్పంచ్ కుంజా నాగమణి, నాయకులు పామర్తి వెంకటేశ్వరరావు, కోమాళ్ల దుర్గాప్రసాద్, కర్నాటి రమేశ్, తాటి ప్రవీణ్, బైటి పొట్టి, సూర్యనారాయణ పాల్గొన్నారు.

వాహనదారులకు కౌన్సెలింగ్

దుమ్ముగూడెం: వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాల బారిన పడకుండా కాపాడుకోవాలని ఎస్ఐ పోటు గణేష్ సూచించారు. వాహన తనిఖీలో భాగంగా భాగంగా ఆయన వేగంగా వెళ్తున్న, హెల్మెట్ ధరించని వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అందరూ కచ్చితంగా లైసెన్స్ కలిగి ఉండడంతో అన్ని పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు.

గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి

బూర్గంపాడు: మండలంలోని లక్ష్మీపురం వద్ద గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి చెందాడు. చెన్నైకు చెందిన సురేష్(38) లారీతో ఐటీసీ పీఎస్‌పీడీకి మెటీరియల్ తీసుకొచ్చి తిరుగు పయనమయ్యాడు. ఈ క్రమంలో లక్ష్మీపురం సమీపాన శుక్రవారం ఆయన గుండెపోటు రాగా అక్కడికక్కడే మృతి చెందాడు. లారీ క్లీనర్ పళని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రహదారి మరమ్మతులు చేయించిన సర్పంచ్

అశ్వాపురం: మండలంలోని మొండికుంట-బీజీ కొత్తూరు మధ్య మణుగూరు-కొత్తగూడెం ఆర్‌అండ్‌బీ రహదారి గుంతలమయమై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో మొండికుంట సర్పంచ్ మర్రి మల్లారెడ్డి శుక్రవారం వెట్ మిక్స్‌తో ప్రధాన రహదారిపై గుంతలు పూడ్పించారు. ఈసందర్భంగా సర్పంచ్‌ను స్థానికులు, వాహనదారులు అభినందించారు.

నియామకం

ములకలపల్లి: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా తాండ్ర ప్రభాకర్‌రావు నియమితులయ్యారు. మండలంలోని తిమ్మంపేటకు చెందిన ఆయనను నియమిస్తూ డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య ప్రకటన విడుదల చేశారు. కాగా, మండల అధ్యక్షుడిగా పేటేటి నర్సింహారావు కొనసాగుతుండగా, కొన్నినెలల క్రితం ప్రభాకర్‌రావు తనను అధ్యక్షుడిగా ప్రకటించారని తెలిపారు. అప్పటివరకు ఇద్దరు వేర్వేరుగా కార్యక్రమాలు నిర్వహిస్తుండగా, జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్య మండల పర్యటనకు వచ్చినప్పుడు కొత్త అధ్యక్షులే కొనసాగుతారని చెప్పినా సమస్య పరిష్కారం కాలేదు. తాజాగా ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షుడిగా కొనసాగుతారని గురువారం ప్రకటన విడుదల చేయడంతో అయోమయానికి తెరపడింది.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

మణుగూరు రూరల్: సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో మణుగూరు జీఎం కార్యాలయం ఎదుట శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యాన నిరాహార దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా బ్రాంచ్ కార్యదర్శి వై.రాంగోపాల్ మాట్లాడుతూ వేజ్‌బోర్డ్‌కు సంబంధించి 23నెలల ఏరియర్లు ఒకేసారి చెల్లించాలని, లాభాల్లో 35శాతం వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీక్ష శిబిరాన్ని పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య సందర్శించి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఎం.వీ.రాంనరసయ్య, మేకల ఈశ్వర్, పుల్లారావు, ఆవుల నాగరాజు, నంబూరి శ్రీనివాస్, గంగాధర్‌రావు, సుభాని, దాట్ల సందీప్‌కుమార్, సాయిప్రకాష్ చారి, కోడిరెక్కల శ్రీనివాస్, రవికుమార్, జి.శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, శంకర్‌రావు, మల్లేష్ పాల్గొన్నారు.

కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలోని రాజవీధికి చెందిన లక్ష్మీజ్యోతిని ఆమె భర్త వేధిస్తున్నట్లు చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు టౌన్ ఎస్సై విజయలక్ష్మి తెలిపారు. అదనపు కట్నం కోసం ఆయన కొన్నాళ్లుగా మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నట్లు బాధితులు శుక్రవారం ఫిర్యాదు చేసిందని పేర్కొన్నారు.

242 జీఓతో మండలానికి నిధులు

పినపాక: ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే రేగా కాంతారావు చొరవ తీసుకుని సీఎం కేసీఆర్‌తో చర్చించి 242 ప్రత్యేక జీఓ ద్వారా మండలంలో బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.12 కోట్లు విడుదల చేయించారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పగడాల సతీష్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని గడ్డంపల్లి నుండి ఆర్ అండ్ బీ రోడ్డు వరకు, అమరారం నుండి కృష్ణాపురం, ఈ బయ్యారం నుండి బీసీ రాయిగూడెం, ఉప్పాక నుండి పోతిరెడ్డిపల్లి, సింగిరెడ్డిపల్లి నుండి వెంకట్రావుపేట, బీసీ రాయగూడెం నుండి చిక్కుడు గుంట వరకు బీటీ రహదారులకు నిధులు వచ్చాయని తెలిపారు. ఈసమావేశంలో ఎంపీపీ గుమ్మడి గాంధీ, సొసైటీ చైర్మన్ రవిశేఖర్‌వర్మ, ఆత్మ చైర్మన్ భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం

అన్నపురెడ్డిపల్లి: మండలంలోని శాంతినగర్‌లో ఎర్రగుంట పీహెచ్‌సీ ఆధ్వర్యాన శుక్రవారం వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా మండల వైద్యాధికారి ప్రియాంక స్థానికులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఫ్రైడే – డ్రైడేను పరిశీలించిన ఆమె పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎస్ నాగేశ్వరరావు, పుష్ప, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

తెరుచుకోని ఎమ్మార్సీ కార్యాలయం



తాళం తీయని మండల విద్యా వనరుల కేంద్రం

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేటలోని ఎమ్మార్సీ(మండల విద్యావనరుల కేంద్రం) శుక్రవారం తెరుచుకోలేదు. విద్యాశాఖలో భాగమైన సమగ్ర శిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న సీఆర్‌పీలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, సీసీఓ, మెసెంజర్లు తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రంలో జరిగిన దీక్షకు వెళ్లారు. దీంతో ఎమ్మార్సీ కార్యాలయాన్ని తెరిచే వారు లేకుండా పోయారు. ఈ విషయం తెలియక వివిధ పనులపై వచ్చిన ఉపాధ్యాయులు వెనుతిరిగారు.

నూతన కమిటీ ఎన్నిక

మణుగూరు రూరల్: నాయీబ్రాహ్మణ సంఘం పట్టణ నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. సంఘం జిల్లా కన్వీనర్ రాచకొండ శ్రీనివాస్, మండల అధ్యక్షుడు చిత్తలూరి భాస్కర్ ఆధ్వర్యాన కమిటీని ప్రకటించారు. ఈమేరకు అధ్యక్షుడిగా దడగల శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా కొయ్యల అభి, కార్యదర్శిగా చింతపల్లి లక్ష్మీనాగేశ్వరరావు, కోశాధికారిగా మునుగుపాటి రాము, సహాయ కార్యదర్శిగా సూత్రపు రవి, ప్రచార కార్యదర్శిగా వేముల నరేష్ ఎన్నికయ్యారని తెలిపారు.

బీజేపీ టికెట్ కోసం దరఖాస్తులు

బూర్గంపాడు: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరఫున పోటీ చేసేందుకు మండలంలోని ఆశావహులు పలువురు శుక్రవారం హైదరాబాద్‌లో దరఖాస్తు చేసుకున్నారు. కొత్తగూడెం అసెంబ్లీ టికెట్ కోసం ఆ పార్టీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల వెంకటరెడ్డి, బిజ్జం శ్రీనివాసరెడ్డి దరఖాస్తు సమర్పించారు. అలాగే, పినపాక టికెట్ కోసం మోరంపల్లిబంజర సర్పంచ్ భూక్యా దివ్యశ్రీ, ఇరవెండికి గుగులోత్ బాలునాయక్‌లు దరఖాస్తు చేసుకున్నారు.

జెడ్పీ చైర్మన్ జన్మదిన వేడుకలు

అశ్వాపురం: మండల కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయినాథుని ఆలయంలో జిల్లా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్య జన్మదిన వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఎంపీపీ ముత్తినేని సుజాత ఆధ్వర్యాన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించాక కేక్ కట్ చేశారు. కాంగ్రెస్ నాయకులు గాదె కేశవరెడ్డి, ముత్తినేని వాసు, వేములపల్లి రమేష్, బొబ్బాల నాగేష్, లంకమల్ల కొండలరావు, చంద్రకళ, మురళి, సతీష్, గొల్లపల్లి నరేష్, చంచు ప్రవీణ్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పల్లె ప్రగతి బాట

మణుగూరు రూరల్: బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కేసీఆర్ పల్లె ప్రగతిబాట మండలంలో కొనసాగుతోంది. ఈమేరకు మండలంలోని కూనవరం గ్రామపంచాయతీ ఎన్‌టీఆర్ నగర్‌లో శుక్రవారం బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అడపా అప్పారావు, కోఆర్డినేటర్ యూసఫ్ షరీఫ్ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలతో రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే రేగా కాంతారావు భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నాయకులు ఉప్పతల రామారావు, బర్ల సురేష్, జట్‌పట్ వెంకన్న, మడి వీరన్న తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో డ్రై డే..

చంద్రుగొండ: విషజ్వరాలు ప్రబలుతున్న నేపథ్యాన మండలంలోని గ్రామాల్లో శుక్రవారం డ్రై డే నిర్వహించారు. ఈసందర్భంగా ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, పంచాయతీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పారిశుద్ధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పోకలగూడెం, తిప్పనపల్లి, గానుగపాడు, రావికంపాడు తదితర గ్రామాల్లో డ్రై డే కొనసాగింది.

దాణాను వినియోగించుకోవాలి

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం పశు సంవర్థక శాఖ ఆధ్వర్యాన జీవాల కోసం అందిస్తున్న దాణాను పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి సూచించారు. మండలంలోని నారంవారిగూడెంలో శుక్రవారం ఆయన 21 మంది గొర్రెల పథకం లబ్ధిదారులకు దాణా పంపిణీ చేసి మాట్లాడారు. దాణా, మందులను గొర్రెలకు సకాలంలో అందిస్తే ఆరోగ్యంగా ఉండడంతో పాటు సకాలంలో ఎదుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ స్వప్న, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బండి పుల్లారావు, సిబ్బంది మధార్, దుర్గాభవాని పాల్గొన్నారు.

శంకుస్థాపన

దుమ్ముగూడెం: మండల పరిధిలోని పర్ణశాల గ్రామ పంచాయతీ పరిధి గోవిందాపురం కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సర్పంచ్ తెల్లం వరలక్ష్మి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రూ.9లక్షల నిధులతో ఈ రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఉప సర్పంచ్ వాగే ఖాదర్‌బాబుతో పాటు సవలం జయమ్మ, సవలం, భద్రయ్య, తెల్లం సమ్మయ్య, కొరసం నాగేశ్వరరావు, తెల్లం నర్సింహారావు, కంగాల భద్రయ్య, శివప్రసాద్ పాల్గొన్నారు.

గొర్రెల యూనిట్లు పంపిణీ

అశ్వాపురం: మండలంలోని మల్లెలమడుగులో పశుసంవర్థక శాఖ ఆధ్వర్యాన లబ్ధిదారులకు రెండో విడత గొర్రెల పంపిణీ చేశారు. ఈ మేరకు ఆరుగురు లబ్ధిదారులకు యూనిట్లు పంపిణీ చేయగా, పశువైద్యాధికారి సరస్వతి, సర్పంచ్ కోడి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



కాంగ్రెస్ పథకాలను వివరిస్తున్న వెంకటేశ్వర్లు

మణుగూరు రూరల్: దేశంతో పాటు తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో వస్తేనే అభివృద్ధి సాధ్యమని పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన కాళీమాత ఏరియా, భగత్‌సింగ్‌నగర్ ప్రాంతాల్లో పర్యటించి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలుచేయనున్న పథకాలను వివరించారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రూ.500కే గ్యాస్ సిలిండర్, ఇళ్ల నిర్మాణానికి రూ.5లక్షలు, రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, మణుగూరు వైస్ ఎంపీపీ కరివేద వెంకటేశ్వరరావుతో పాటు వెంకట్రావు గౌడ్, కనకయ్య, బాజీ, తరుణ్‌రెడ్డి, పీరినాకి నవీన్, సామా శ్రీనివాస్‌రెడ్డి, బీరం సుధాకర్‌రెడ్డి, కటుకూరి శ్రీనివాస్‌రావు, రామకృష్ణ, మధుసూదన్, కృష్ణ, మహబూబ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పోషకాహార వారోత్సవాలు

దమ్మపేట: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లోపోషకాహార వారోత్సవాలను కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో శుక్రవారం మల్లారం సెక్టార్ సూపర్‌వైజర్ సాలమ్మ ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో పోషకాహార ప్రాముఖ్యతను లబ్ధిదారులకు వివరించారు. కేంద్రాల్లో అందించే బాలామృతం, గుడ్లు, పాలు, పప్పును సద్వినియోగం చేసుకోవాలని, శిశువు జన్మించగానే తల్లి ముర్రు పాలు పట్టించాలని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు హేమ సుందరి, చక్రపు సుమతి, ఆయాలు పాల్గొన్నారు.

జగన్నాథపురంలో..

ములకలపల్లి: ములకలపల్లి మండలం జగన్నాథపురంలో శుక్రవారం ఐసీడీఎస్ పోషకాహార వారోత్సవాలను నిర్వహించారు. ఈసందర్భంగా రైతువేదికలో గర్భిణులకు సామూహిక సీమంతం జరిపించగా చిన్నారులకు వెల్ బేబీషో నిర్వహించి బహుమతులను అందజేశారు. దమ్మపేట క్లస్టర్ సీడీపీఓ రేవతి మాట్లాడగా సర్పంచ్‌లు గడ్డం భవాని, కారం సుధీర్, ఎంపీటీసీ సున్నం సునీత, రైతుసమన్వయ సమితి నాయకులు ఇనుగంటి రాము, సూపర్‌వైజర్ నాగమణి, హైస్కూల్ హెచ్ఎం భాను, సీహెచ్ఓ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని కన్నాయిగూడెం, చెన్నాపురం, అశ్వారావుపేటలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం పోషకాహార వారోత్సవాలను నిర్వహించారు. ఈసందర్భంగా గర్భిణులకు సామూహిక సీమంతం జరిపించగా, పోషకాహార పదార్థాలతో ప్రదర్శన ఏర్పాటుచేశారు. సర్పంచ్ గొంది లక్ష్మణ్‌రావు, సూపర్‌వైజర్లు పద్మావతి, విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు విద్యాసాగర్, రామకృష్ణ, అంగన్‌వాడీ టీచర్లు సామ్రాజ్యం, కృష్ణకుమారి, చిట్టెమ్మ, లక్ష్మీ, వరలక్ష్మి పాల్గొన్నారు.

అక్షరాభ్యాసం

చంద్రుగొండ: చంద్రుగొండలో ఐసీడీఎస్ ఆధ్వర్యాన చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం, అన్నప్రాసన నిర్వహించారు. సూపర్‌వైజర్ రాణి మాట్లాడుతూ పిల్లలకు పౌష్టికాహారం ఇవ్వాలని, చిన్ననాటి నుండి ఆరోగ్యంగా పెంచాలని తల్లులకు సూచించారు. హెచ్‌వీ పద్మ, ఏఎన్ఎం సుజాత, కార్యకర్తలు అరుణ, భూషమ్మ, సరోజిని, విజయ పాల్గొన్నారు.



చంద్రుగొండ: చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న సిబ్బంది

'ఎక్స్‌లెంట్'లో సంపూర్ణ అక్షరాస్యత

మణుగూరు రూరల్: ప్రపంచ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని సీ టైప్ ప్రాంతంలోని ఎక్స్‌లెంట్ స్టార్ పాఠశాలలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల డ్రైవర్లు, ఆయాలు, క్లీనర్లతో అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం ఎక్స్‌లెంట్ విద్యాసంస్థల చైర్మన్ యూసుఫ్ షరీఫ్ మాట్లాడుతూ తమ పాఠశాల సిబ్బంది అందరూ పేరు, ఊరు రాయడంతో పాటు పత్రికలు చదివేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దుతారని తెలిపారు. ఎక్స్‌లెంట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ ఖాదర్, డైరెక్టర్ యాకూబ్ షరీఫ్, ఉపాధ్యాయులు సమీయ నయ్యర్, వనజ, విజయలక్ష్మి, సునీత, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.